క్లుప్తంగా

నేటి నుంచి బస్‌పాస్‌ల రెన్యువల్

నరసాపురం: నరసాపురం ఆర్టీసీ డిపో పరిధిలోని నరసాపురం, పాలకొల్లు బస్టాండ్స్‌లో సోమవారం నుంచి ఇంటర్ విద్యార్థులకు ఆర్టీసీ బస్‌పాస్‌లు రెన్యువల్ చేస్తున్నట్టు నరసాపురం ఆర్టీసీ డిపో మేనేజర్ ఎస్.సుబ్బన్నరెడ్డి తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు త్వరలో తరగతులు ప్రారంభకానున్న నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నామని పేర్కొన్నారు. బస్టాండ్‌లో ఏర్పాటు చేసిన కౌంటర్లలో విద్యార్థులు పాస్‌లు రెన్యువల్ చేసుకోవాలని సూచించారు.

పాస్టర్ మృతిపై సమగ్ర విచారణ చేయాలి



యండగండిలో ర్యాలీ నిర్వహిస్తున్న క్రైస్తవులు

ఉండి: పాస్టర్ ప్రవీణ్ పగడాల మృతిపై సమగ్ర విచారణ చేయించాలని యండగండి ఇమ్మానుయేలు లూథరన్ చర్చ్ క్రైస్తవ సోదరులు మండిపడ్డారు. పాస్టర్ ప్రవీణ్ మృతిపై తగిన న్యాయం చేయాలంటూ ఆదివారం యండగండిలో క్రైస్తవ సోదరులు శాంతి ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా డాక్టర్ డి.ప్రసాదరావు మాట్లాడుతూ పాస్టర్లపై జరుగుతున్న దాడులను అరికట్టాలన్నారు. కార్యక్రమంలో సంఘ పెద్దలు జౌదుల రాజ్‌కుమార్, ఏనేపల్లి సుబ్బరాజు, బొట్టు తాతారావు, కొమ్ముల దావీదు, విప్పర్తి బుచ్చియ్య, పీసీసీ సభ్యుడు తాడేపల్లి మోషే, నూకపాయి రాంకుమార్, గొర్రుముచ్చు సుందర్ కుమార్, వెలగపల్లి టోనీ, మానుకొండ సురేష్, విప్పర్తి సురేష్, తదితరులు పాల్గొన్నారు.

కూటమి తీరుతో రైతుల ఇబ్బందులు



నంద్యాల సీతారామయ్య

ఆకివీడు: రైతాంగ వ్యవస్థను కూటమి ప్రభుత్వం నిర్వీర్యం చేస్తుందని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షులు నంద్యాల సీతారామయ్య ధ్వజమెత్తారు. ఆక్వా, వరి రైతులు పడుతున్న ఇబ్బందులపై ఆయన ఆదివారం విలేకరులతో మాట్లాడారు. వరి రైతులకు కనీసం మద్దతు ధర లభించకుండా చేస్తున్నారన్నారు. ఖరీఫ్‌లో రైతులు అయినకాడికి అమ్ముకోవలసి వచ్చిందని ఆరోపించారు. దళారులు ప్రవేశించి ధాన్యంలో తేమ, రంగు మారిందని సాకులతో ధరలు తగ్గించి మిల్లర్లకు అమ్ముతున్నారన్నారు. గతంలో వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో వరి రైతుల అకౌంట్లలో మద్దతు ధర పూర్తిగా పడిందన్నారు. ఈ దాళ్వా సీజన్‌లోనైనా రైతులకు మద్దతు ధర లభించే విధంగా ప్రభుత్వం, అధికారులు కృషి చేయాలన్నారు. దళారుల బెడద లేకుండా చూడాలని డిమాండ్ చేశారు.

ఆక్వా రైతులను ముంచేశారు

ఆక్వా రైతులను కూటమి ప్రభుత్వం నిండా ముంచేసిందని సీతారామయ్య ఆవేదన వ్యక్తం చేశారు. గత పది నెలల్లో ఆక్వా రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. ఒక పక్క రొయ్యకు ధరను తగ్గించి వేస్తున్నారని, మరో పక్క మేత ధరలను విపరీతంగా పెంచి వేస్తున్నారని ఆరోపించారు. రొయ్య ధరలు కూటమి నాయకుల చేతుల్లోనే ఉన్నాయన్నారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఆక్వా రైతులకు ఇచ్చిన హామీలను ఒక్కటీ అమలు చేయలేదని మండిపడ్డారు.

బాలా త్రిపుర సుందరీదేవికి ప్రత్యేక పూజలు



పుచ్చకాయల అలంకరణలో బాలా త్రిపుర సుందరీదేవి

భీమవరం(ప్రకాశంచౌక్): స్థానిక మెంటేవారి తోటలోని శ్రీబాలా త్రిపుర సుందరీదేవి అమ్మవారిని పుచ్చకాయలతో అలంకరణ చేశారు. శ్రీరామ నవమి, వసంత నవరాత్రులను పురస్కరించుకుని ఆదివారం ఆలయ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో విజయనగరానికి చెందిన జున్నూరి కృష్ణలోవ దొరబాబు, శశిరేఖ దంపతులచే ఆలయ అర్చకులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పుచ్చకాయలతో అమ్మవారికి పూజ చేసి, ప్రత్యేక అలంకరణ చేశారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు, బాలా త్రిపుర సుందరీదేవి మహిళ సేవా సంఘం సభ్యులు పాల్గొన్నారు.

గడ్డివాము దగ్ధం

భీమవరం: పట్టణంలోని 29వ వార్డు గాంధీనగర్ రెండో వీధిలో పశువుల పాకకు శనివారం రాత్రి నిప్పంటుకొని రెండెకరాల విస్తీర్ణంలో గడ్డివాము దగ్ధమైందని అగ్నిమాపక అధికారి సీహెచ్ సూర్యప్రకాశ్‌రావు ఆదివారం చెప్పారు. కె.సుబ్బలక్ష్మికి చెందిన పశువుల పాకకు నిప్పంటుకోవడంతో సమాచారం తెలిసిన వెంటనే ఘటనా ప్రాంతానికి వెళ్లి గేదెలను బయటకు తీసుకొచ్చి మంటలను అదుపు చేసినట్లు చెప్పారు. అగ్ని ప్రమాదం వలన సుమారు రూ.20 వేల ఆస్తి నష్టం ఏర్పడినట్లు అంచనా వేసినట్లు సూర్యప్రకాశ్‌రావు తెలిపారు.

గ్రామాల్లో రాములోరి కల్యాణ సందడి

- భక్తిశ్రద్ధలతో శ్రీరామనవమి వేడుకలు నిర్వహించిన ప్రజలు
- భక్తులతో రామాలయాలు కిటకిట



నరసాపురం: కుమ్మరివీధి రామాలయంలో సీతారామ కల్యాణ మహోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం



నరసాపురం: చినమామిడిపల్లి ఓఎన్జీసీ రోడ్డు వద్ద రాములోరి కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం



పెనుగొండ: సిద్ధాంతం రామాలయంలో కల్యాణోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

నరసాపురం: శ్రీరామనవమి వేడుకలు ఆదివారం నరసాపురం పట్టణంలో ఘనంగా నిర్వహించారు. గ్రామాల్లోని రామాలయాల వద్ద సీతారామ కల్యాణ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. మెయిన్‌రోడ్డులో ఉన్న కుమ్మరివీధి రామాలయంలో, శనివారపుపేట రామాలయం, పొన్నపల్లి రామాలయం, పాతబజార్ రామాలయంలో శ్రీరామనవమి వేడుకలు నిర్వహించారు. పాతబజార్‌లోని శ్రీరామసాయిమందిర్‌లో వలవల సురేష్ ఆధ్వర్యంలో, చినమామిడిపల్లిలో ఓఎన్జీసీ రోడ్డులో శ్రీరామ నవిమిని నిర్వహించారు.

నరసాపురం రూరల్: మండలంలో ఆదివారం శ్రీరామనవమిని ఘనంగా నిర్వహించారు. మండలంలోని కొప్పర్రు, సీతారామపురం, వేములదీవి, పసలదీవి, లక్ష్మణేశ్వరం, తూర్పుతాళ్లు, దర్భరేవు, కేబేతపూడి, తదితర గ్రామాల్లోని రామాలయాల్లోని సీతారామ కల్యాణాన్ని కన్నుల పండువగా నిర్వహించారు. కొప్పర్రులో నిర్వహించిన వేడుకల్లో భాగంగా 1865లో నిర్మించిన పురాతన ఆలయానికి సంబంధించిన ఆలయ వ్యవస్థాపక వారసులు డాక్టర్ చినమిల్లి సత్యనారాయణరావును సత్కరించారు. కార్యక్రమంలో ఆలయ మాజీ చైర్మన్‌లు చినిమిల్లి వీరబాబు, సూరిబాబు, రావి బ్రహ్మాజీ, మధుసూధన్‌రావు పాల్గొన్నారు.

పాలకొల్లులో..

పాలకొల్లు సెంట్రల్: శ్రీరామనవమి పర్వదినం సందర్భంగా పట్టణంలోని వివిధ కూడళ్లలో ఉన్న రామాలయాల్లో శ్రీ సీతారాముల కల్యాణ మహోత్సవాలు వైభవంగా నిర్వహించారు. ఆదివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకూ భక్తులు సీతారాముల కల్యాణోత్సవ పూజా కార్యక్రమాలు నిర్వహిస్తూనే ఉన్నారు. కల్యాణ ఉత్సవం ముగిసిన అనంతరం భక్తులకు చలివిడి, పానకం, వడపప్పు ప్రసాదం అందజేశారు. స్థానిక మారుతి సెంటర్ రామాలయం, బుధవారపు వీధి రామాలయం, యడ్లబజారు సెంటర్ పంచముఖ ఆంజనేయస్వామి ఆలయంలో, ముచ్చర్లవారి వీధి, మన్యం జగ్గమ్మ సత్రం, మెయిన్‌రోడ్డు శ్రీ క్షీరారామ సువర్ణ వర్తక సంఘం ఆధ్వర్యంలో, పినిశెట్టి వారి వీధి మన్యం జగ్గమ్మ సత్రం, బ్రాడీపేట శ్రీ లక్ష్మీగణపతి ఆలయంలో, వెలమగూడెం, రంగమన్నారుపేట సెంటర్, కెనాల్ రోడ్డు దాసోహాంజనేయ స్వామి, లజపతిరాయ్‌పేట, హౌసింగ్‌బోర్డు కాలని, రైల్వేగేటు సెంటర్, గజలక్ష్మి సెంటర్, బార్గవినగర్, వడలివాని పేట, డాంపేట, రామాలయాల్లో స్వామివారి కల్యాణ మహోత్సవ కార్యక్రమాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. కల్యాణం అనంతరం కొన్ని రామాలయాల వద్ద అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటుచేశారు. పట్టణ ధర్మ పరిరక్షణా సమితి సభ్యుల ఆధ్వర్యంలో కల్యాణం జరుగుతున్న రామాలయాల వద్దకు వెళ్లి స్వామివారికి పట్టు కండువా, అమ్మవారికి పసుపు, కుంకుమ, జాకెట్‌ముక్కలు, పూజా సామగ్రి అందజేశారు. ఈ కార్యక్రమంలో గాదె వెంకన్న, మద్దు వాసు, శీరం ఆనందకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

పెనుమంట్రలో...

పెనుమంట్ర: మండలంలో శ్రీ సీతారాముల కల్యాణోత్సవాలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఎస్.ఇల్లిందలపర్రులోని రామాలయం వద్ద ఆలయ అర్చకులు వేణుగోపాలాచార్యులు ఆధ్వర్యంలో పెనుమంట్ర ఎంపీపీ కర్రి వెంకట నారాయణరెడ్డి, రాధా దంపతులు కల్యాణోత్సవాన్ని నిర్వహించారు. పెనుమంట్ర ఊసల రామాలయం వద్ద అజయ్‌రెడ్డి, డాక్టర్ లేఖారెడ్డి దంపతులు, ఆలమూరులో కోదండరామాలయం వద్ద పడాల రామకృష్ణారెడ్డి, లక్ష్మీచారుమతి దంపతులు కల్యాణం చేశారు. సాయంత్రం శ్రీరామ నామ జపంతో మహిళలు సీతారాములవారిని పల్లకిలో ఊరేగించారు. జుత్తిగలో సోమేశ్వర ఆలయం వద్ద నల్లమిల్లి విజయ్‌కుమార్‌రెడ్డి దంపతులు ఆధ్వర్యంలో కల్యాణాలు జరిపారు. నెగ్గిపూడిలో యజ్జపురి రామాలయం వద్ద జరిగిన సామూహిక కల్యాణోత్సవంలో మాజీ సర్పంచ్‌లు కర్రి అచ్యుతరామారెడ్డి, అల్లం భాస్కరరెడ్డి దంపతులు సమేతంగా పాల్గొని కల్యాణోత్సవాలు నిర్వహించారు. వెలగలవారిపాలెం గ్రామంలో కల్యాణోత్సవం అనంతరం అన్నసమారాధన చేశారు. మార్టేరు, నత్తారామేశ్వరం, మాముడూరు, పాలమూరు గ్రామాల్లోని రామాలయాల్లో సామూహిక కల్యాణోత్సవాలు, అన్నసమారాధనలు నిర్వహించారు.

పెనుగొండలో..

పెనుగొండ: శ్రీరామ నవమి సందర్భంగా ఆదివారం వాడవాడలా సీతారాముల కల్యాణోత్సవం కనుల పండుగగా నిర్వహించారు. తెల్లవార జాము నుంచే గ్రామాల్లో రామాలయాలు, చిన్నారులు ఏర్పాటు చేసిన సీతారాముల కల్యాణ వేదికల వద్ద కల్యాణోత్సవం వేద మంత్రాల సాక్షిగా భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. పెనుగొండలో శాంతి నగర్, ఇందిరా శాంతి నగర్, రామచంద్రరావు పేట, బీళ్లవారి రామాలయం, కొప్పిశెట్టివారి వీధి రామాలయం, జవ్వాది వారి వీధి రామాలయం, బజారు రామాలయం, కంబాల వారి వీధి రామాలయం, చెరుకువాడ కటకటాల రామాలయం, సంతమార్కెట్‌లో నీరుల్లి వర్తక సంఘం ఆధ్వర్యంలోనూ,వడలిలో కాపుల రామాలయం, కమ్మవారి రామాలయం, సిద్ధాంతంలో హిందూ ధర్మ పరిషత్ ఆధర్వంలో రావిచెట్టు సెంటర్‌లో, చౌదరీస్ రామాలయం, దొంగరావి పాలెం రామాలయం వద్ద కల్యాణాన్ని వేడుకగా నిర్వహించారు.

ఆకట్టుకున్న చిన్నారుల రథోత్సవం

వడలిలో కమ్మవారి రామాలయం వద్ద కల్యాణోత్సవం అనంతరం చిన్నారుల రథోత్సవం ఆకట్టుకుంది. ప్రతి ఏటా ఆనవాయితీగా చిన్నారుల రథోత్సవం నిర్వహిస్తారు. దీనిలో భాగంగా చిన్నారులు సీతారాములను రథంపై నిలిపి ఉత్సవం భక్తి శ్రద్ధలతో జై శ్రీరామ్ అంటూ నినాదాలు చేస్తూ ఉత్సవం నిర్వహించారు. సిద్ధాంతంలో హిందూ పరిషత్ సభ్యులు సాంప్రదాయ దుస్తులు ధరించి ఉత్సవంలో పాల్గొన్నారు. సీతారాములను హంస వాహనంపై ఉంచి ఉత్సవం నిర్వహించారు.

ఆచంట మండలంలో..

ఆచంట మండలంలో శ్రీరామనవమి వేడుకలు వైభవంగా నిర్వహించారు. ఆచంటలో కాపుల పాలెం, బస్టాండ్ వద్ద , కొడమంచిలి, కోడేరు, వల్లూరులతో పాటు పలు గ్రామాల్లో సీతారాముల కల్యాణోత్సవం కనుల పండుగగా నిర్వహించారు. ఆయా ఆలయాల వద్ద చలివిడి, పానకాలు పంపిణీ చేశారు. కల్యాణోత్సవాలు అనంతరం భారీ అన్నసమారాధన నిర్వహించారు.

ఘనంగా శ్రీరామనవమి వేడుకలు

యలమంచిలి: అయోధ్యలో బాల రాముని ప్రతిష్ఠ అనంతరం వచ్చిన రెండవ శ్రీరామనవమి వేడుకలను గ్రామాలలో భక్తులు అత్యంత భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. రామాలయాలలో శ్రీసీతారామ పట్టాభిషేక ఉత్సవాలు ఆదివారం కనుల పండుగగా జరిగాయి. భక్తులకు చలివిడి, పానకాలు ప్రసాదంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మేడపాడు మేడిచర్ల వారి వీధిలో ఉన్న రామాలయం వద్ద ఏకాహ భజన ఏర్పాటు చేశారు. రామాలయాల వద్ద భక్తులకు అఖండ అన్నసమారాధనలు నిర్వహించారు.



యలమంచిలి: మేడపాడులో రామాలయం వద్ద పూజలు చేస్తున్న భక్తులు



యలమంచిలి: మేడపాడులో సీతారాముల కల్యాణ క్రతువులో పాల్గొన్న దంపతులు



నరసాపురం రూరల్: కొప్పర్రు రామాలయంలో చినమిల్లి సత్యనారాయణరావును సత్కరిస్తున్న దృశ్యం



పాలకొల్లు సెంట్రల్: మన్యం జగ్గమ్మసత్రం రామాలయం వద్ద సీతారాముల కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం



పెనుగొండ: సిద్ధాంతంలో పల్లకి సేవలో హిందూ ధర్మ పరిషత్ సభ్యులు



పెనుమంట్ర: మండలంలో పల్లకి సేవ చేస్తున్న భక్తులు

నరసాపురం జనసేనలో ఏఎంసీ లొల్లి

- ఎమ్మెల్యే నాయకర్ ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారంటూ ఓ వర్గం గుర్రు
- కీలక నేత ద్వారా పవన్ వద్దకు పంచాయితీ?



బొమ్మిడి నాయకర్ ఎమ్మెల్యే



తోట శ్రీధర్, జనసేన నేత

నరసాపురం: అగ్రికల్చర్ మార్కెట్ యార్డ్ చైర్మన్ ఎంపికలో నరసాపురం జనసేనలో రాజుకున్న లొల్లి చర్చనీయాంశమైంది. ఆరేళ్ల నుంచి అండగా ఉన్న నాయకులను కాదని, ఊరికే హడావుడి చేస్తూ ఎమ్మెల్యేకు భజన చేస్తున్న నాయకులను అందలమెక్కిస్తున్నారని నరసాపురంలో జనసేన నాయకులు రగిలిపోతున్నారు. ఇక కూటమి ధర్మాన్ని ఏ మాత్రం పట్టించుకోకుండా తమను వాడుకుని పక్కన పెట్టేశారని టీడీపీ కీలక నేతలు కూడా తమ అసంతృప్తిని బహిరంగంగానే వ్యక్తం చేస్తున్నారు. దీంతో నరసాపురం కూటమిలో కుంపట్లు రాజుకుంటున్నాయి. కొన్ని రోజుల క్రితం ఏఎంసీ చైర్మన్‌గా జనసేన నేత వలవల నాని పేరును ఎమ్మెల్యే ఖరారు చేసినట్టుగా వార్తలు వచ్చాయి. ఈ నిర్ణయం జనసేనలో మొదటి నుంచి పని చేస్తున్న కొందరు నేతలకు రుచించలేదు. దీంతో ఇప్పటికే స్థానికంగా రెండు, మూడు గ్రూపులుగా ఉన్న జనసేన నాయకుల గణం మరో కొన్ని గ్రూపులుగా విడిపోయింది. ముఖ్యంగా వ్యాపారవేత్తగా, రైతుగా పేరున్న తోట శ్రీధర్‌కు ఏఎంసీ పదవిని ఎమ్మెల్యే నాయకర్ ఎప్పుడో ఆఫర్ చేసినట్టుగా చెబుతున్నారు. ఇప్పుడు నీడగా ఉంటూ భజన చేస్తున్న నాయకుడికి ఎమ్మెల్యే కొమ్ముకాయడం ఏంటి? అని మెజారిటీ జనసేన నాయకుల వాదన. తోట శ్రీధర్‌కు ఏఎంసీ ఇవ్వకపోతే ఇక పార్టీ కార్యక్రమాలకు కటీఫ్ చెప్పడమే కాకుండా, రానున్న మున్సిపల్ ఎన్నికల్లో తమ తడాఖా చూపించడానికి కూడా సదరు నాయకులు సిద్ధమైనట్టు సమాచారం.

టీడీపీ నాయకుల అసంతృప్తి

ఇక ఎన్నికలై జనసేన గెలిచిన తరువాత ఎమ్మెల్యే నాయకర్ వ్యవహార తీరుతో టీడీపీ నాయకులు అసంతృప్తితో రగలిపోతున్నారు. టీడీపీ ఆవిర్భావం నుంచి నియోజకవర్గంలో దీర్ఘకాలం ఆ పార్టీ అధికారంలో ఉంది. పొత్తులో భాగంగా ఈ ఎన్నికల్లో టీడీపీ సీటు త్యాగం చేసి జనసేనకు కేటాయించింది. అయితే గెలిచిన తరువాత ఎమ్మెల్యే టీడీపీ నేతలను అసలు పట్టించుకోవడం లేదనే అసంతృప్తి ఆ పార్టీ నేతల్లో ఉంది. కనీసం నామినేటెడ్ పోస్టుల్లో కూడా ప్రాధాన్యత ఇవ్వకపోవడాన్ని టీడీపీ శ్రేణులు జీర్ణించుకోలేకపోతున్నాయి. ఏఎంసీ పదవిని టీడీపీకి చెందిన ముగ్గురు కీలక నేతలు ఆశించారు. వారికి కూడా మొండిచెయ్యే ఎదురవ్వడంతో సదరు నేతలు తమ తదుపరి కార్యాచరణపై దృష్టి పెట్టినట్టు తెలిసింది.

కోటరీకే ఎమ్మెల్యే పరిమితం

ఎన్నికల్లో నియోజకవర్గంలో మెజారిటీ వర్గంగా ఉన్న కాపు సామాజికవర్గం ఎమ్మెల్యే నాయకర్ విజయంలో కీలక పాత్ర పోషించింది. అయితే గెలిచిన తరువాత నాయకర్ ఓ కోటరీ ఏర్పాటు చేసుకుని సదరు కోటరీ చెప్పిన మేరకే వ్యవహారాలు నడుపుతున్నారనే విమర్శలు న్నాయి. పార్టీ కార్యాలయానికి వెళితే కనీసం పలకరించే దిక్కు కూడా లేకుండా పోయిందని ఎన్నికల్లో చొక్కాలు చింపుకుని తిరిగిన నాయకులు బేల ముఖాలు వేసుకుని కనిపించిన అందరి వద్దా.. ఆవేదన వెళ్లగక్కుతున్నారు. ఎన్నడూ లేని విధంగా మున్సిపల్ మార్కెట్ పన్ను వసూల్ల వేలంలో మతలబులు, పంటురేవు నిర్వహణలో అవినీతి ఆరోపణలు, పేకాట క్లబ్‌ల వ్యవహారాలు కొన్ని రోజులుగా విపరీతంగా చర్చనీయాంశాలుగా మారాయి. ఈ వ్యవహాలన్నిటినీ ఓ కీలక నేత ద్వారా జనసేన అధినేత పవన్‌కల్యాణ్ వద్దే పెట్టి పంచాయితీ తేల్చాలని నాయకులు నిర్ణయించినట్టు సమాచారం.

పరాయి పంచన ప్రభుత్వ కార్యాలయం



పెనుమంట్ర మహిళా మండలి భవనంలో నిర్వహిస్తున్న తహసీల్దార్ కార్యాలయం



పెనుమంట్ర ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో పునాదిలోనే నిలిచిపోయిన తహసీల్దార్ కార్యాలయ భవనం

- తహసీల్దార్ కార్యాలయానికి సొంత గూడు కరువు

పెనుమంట్ర: మండల రెవెన్యూ వ్యవస్థ ఏర్పడి నాలుగు దశాబ్దాలు పూర్తి అవుతున్నా పెనుమంట్ర మండల రెవెన్యూ కార్యాలయానికి సొంత భవనం లేక పరాయి పంచనే ఇరుకు గదుల్లో సిబ్బంది కార్యకలాపాలు నిర్వహిస్తున్నారు. 1985లో మండల రెవెన్యూ వ్యవస్థను ఏర్పాటు చేసిన సమయంలో పెనుమంట్ర గ్రామ కచేరి భవనంలో మండల రెవెన్యూ కార్యాలయాన్ని ఏర్పాటు చేశారు. క్రమేపి ఆ భవనం శిథిలావస్థకు చేరడంతో 2001లో మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో ఉన్న బ్రాహ్మణచెరువలో ఇరిగేషన్ బంగ్లాలో తహసీల్దార్ కార్యాలయాన్ని ఏర్పాటు చేశారు. ఇది కూడా శిథిలాస్థితికి చేరుకోవడంతో 2017లో పెనుమంట్ర మెయిన్ రోడ్డులో సొసైటీ పక్కన ఉన్న మహిళా మండలి భవనాన్ని మరమ్మతులు చేసి, అందులో తహసీల్దార్ కార్యాలయాన్ని ఏర్పాటు చేశారు.

శంకుస్థాపనకే పరిమితం

అనంతరం ఇరిగేషన్ బంగ్లాను కూల్చివేసి ఆ స్థలంలో రూ.90 లక్షల అంచనా వ్యయంతో 2018 ఏప్రిల్ 27న అప్పటికార్మికశాఖ మంత్రి ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ శంకుస్థాపన చేశారు. ఈ భవన నిర్మాణాన్ని అర్థాంతరంగా పునాది దశలోనే వదిలేశారు. ఇటీవల జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి ఈ ప్రాంతాన్ని సందర్శించి రెవెన్యూ కార్యాలయం నిర్మించేందుకు ఇంజినీరింగ్ అధికారులను ప్రతిపాదనలు రూపొందించాలని ఆదేశాలు ఇచ్చారు. కలెక్టర్ ఆదేశాలతో అయినా అధికారులు తహసీల్దార్ భవన నిర్మాణానికి చర్యలు తీసుకుంటారో? లేదో? వేచి చూడాలని స్థానికులు పేర్కొంటున్నారు.

ప్రతిపాదనలు పంపారు



జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఇంజినీరింగ్ అధికారులు రూ.1.10కోట్ల అంచనా వ్యయంతో ప్రతిపాదనలు రూపొందించి జిల్లా అధికారులకు పంపించారు. ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు రాగానే నిర్మాణ పనులు తిరిగి ప్రారంభిస్తారు.

– వై.రవికుమార్, తహసీల్దార్, పెనుమంట్ర

సబ్‌స్టేషన్ నిర్మాణానికి మోక్షం కలిగేనా?

- రూ.133 కోట్లతో సబ్ స్టేషన్ నిర్మాణానికి గత ప్రభుత్వం అడుగు
- టెండర్ దశలో నిలిచిన భారీ విద్యుత్ సబ్‌స్టేషన్ పనులు



నరసాపురంలో ప్రస్తుతం ఉన్న విద్యుత్ సబ్‌స్టేషన్

నరసాపురం: నరసాపురంలో భారీ విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణానికి గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పూనుకుంది. స్వయంగా అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. టెండర్ దశకు చేరుకున్న ఈ ప్రాజెక్ట్ నిర్మాణం కొత్త కూటమి ప్రభుత్వంలో అటకెక్కింది. వేసవి వచ్చేసింది. జనం లో ఓల్టేజ్ సమస్యతో నానా ఇబ్బందులు పడుతున్నారు. విద్యుత్ లో–ఓల్టేజ్ సమస్యలకు చెక్ పెడుతూ రూ.133 కోట్లుతో 10 ఎకరాల స్థలంలో 50 ఎంవీఏ సామర్థ్యంతో 220/132/11 కేవీ భారీ సామర్థ్యంతో ఈ కొత్త విద్యుత్ సబ్‌స్టేషన్‌ను గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం నిర్మించ తలపెట్టింది. అన్నీ సవ్యంగా సాగితే ఇప్పటికే సబ్‌స్టేషన్ సేవలు అందుబాటులోకి వచ్చేవి. గత ప్రభుత్వం ట్రాన్స్‌కో ద్వారా దీనికి సంబంధించి జీవో నెంబర్ 2368ను 2021 ఫిబ్రవరి నెలలో విడుదల చేసింది. వెంటనే టెండర్లు పిలిచి పనులు మొదలు పెట్టడానికి సన్నాహాలు చేశారు. అయితే ప్రభుత్వం మారడంతో పనులకు అతీగతీ లేకుండా పోయింది.

లో–ఓల్టేజ్ సమస్య పరిష్కరించాలని..

నరసాపురంలో ఇప్పటికే 132/11 కేవీ సబ్‌స్టేషన్ ఉంది. ఈ సబ్‌స్టేషన్‌లో గతంలో 50 ఎంవీఏ సామర్థ్యం ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ ఉండేది. 2020లో ఆ ట్రాన్స్‌ఫార్మర్ సామర్థ్యాన్ని 80 ఎంవీఏకుపెంచారు. మళ్లీ అదనంగా దానికి అనుసంధానంగా మరో 50 ఎంవీఏ సామర్థ్యం ఉన్న కొత్త 220/132/11 కేవీ సబ్‌స్టేషన్‌ను అందుబాటులోకి తేవాలని గత ప్రభుత్వంలో నిర్ణయించారు. నరసాపురం, పాలకొల్లు, యలమంచిలి, మొగల్తూరు, పోడూరు మండలాలకు ప్రస్తుతం నరసాపురం సబ్‌స్టేషన్ నుంచే విద్యుత్ సరఫరా జరుగుతుంది. ఇందులో నరసాపురం, పాలకొల్లు మున్సిపాలిటీలు ఉన్నాయి. నరసాపురం, పాలకొల్లు రూరల్ మండలాలు, యలమంచిలి, మొగల్తూరు, పోడూరు మండలాల్లో ఎంతోకాలంగా విద్యుత్ లో–ఓల్టేజ్ సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్యలకు చెక్ పెట్టడానికి భారీ విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మించాలని గత ప్రభుత్వంలో అప్పటి ప్రభుత్వ చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు ఈ ప్రాజెక్ట్ మంజూరు చేయించారు. వెంటనే రుస్తుంబాధలో 10 ఎకరాల స్థలాన్ని సేకరించారు. ఇప్పటికైనా అధికారులు, నాయకులు స్పందించిన విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

టెండర్లు పిలిచి పనులు మొదలుపెట్టాలి



కొత్త విద్యుత్ సబ్‌స్టేషన్‌కు ముదునూరి ప్రసాదరాజు నిధులు మంజూరు చేయించారు. ఎన్నికలు రావడంతో టెండర్లు పిలవడంలో ఇబ్బందులు ఎదురయ్యాయి. నిధులు అందుబాటులో ఉన్నాయి. టెండర్లు పిలిచి పనులు త్వరగా ప్రారంభించి పూర్తి చేయడానికి ఇబ్బంది ఏంటో అర్థం కావడం లేదు. కొత్త సబ్‌స్టేషన్ అందుబాటులోకి లోకి వస్తే లో–ఓల్టేజ్ సమస్యలు ఉండవు.

– బర్రి శ్రీవెంకటరమణ, మున్సిపల్ చైర్‌పర్సన్

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు | వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు | శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

నరసాపురం డివిజన్
90102 23729 (పాలకొల్లు)
95055 07552 (పాలకొల్లు)
90102 23729 (ఆచంట)
95055 07552 (నరసాపురం)
Office mail : tpgadvt@gmail.com